# పేదల వైద్య సంజీవని బస్తీ దవాఖాన

- అందుబాటులో వైద్య సేవలు
- రోగులకు తప్పిన వ్యయ ప్రయాసలు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

మేడ్చల్, నవంబర్ 11 : స్వరాష్ట్రంలో అన్ని రంగాల్లో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయి. అందులో భాగంగా ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానలు వైద్య సంజీవనిలుగా మారాయి. ఉమ్మడి రాష్ట్రంలో వైద్య రంగం పూర్తిగా నిర్వీర్యమైంది. మండలానికి ఒక పీహెచ్‌సీ, పట్టణం అయితే ఒక వైద్య విధాన పరిషత్ దవాఖాన ఉండేది. అందులోనూ పూర్తిస్థాయిలో వైద్యం అందించ లేని పరిస్థితులు ఉండేవి. సరైన మందులు, పరికరాలు ఉండేవి కావు. ఒక్క మాటలో చెప్పాలంటే ప్రథమ చికిత్స కేంద్రాలుగా మాత్రమే ఉండేవి. దీంతో ప్రజలు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి, రూ.వేలల్లో ఖర్చు చేయాల్సి వచ్చేది.



మేడ్చల్‌లోని పాత గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన బస్తీ దవాఖాన

ప్రజల ఇబ్బందులను గుర్తించిన సీఎం కేసీఆర్ పీహెచ్‌సీలు, వైద్యవిధాన పరిషత్ దవాఖానలను బలోపేతం చేయడంతోపాటు జనాభా ఎక్కువగా ఉన్న పట్టణాల్లో బస్తీ దవాఖానలకు శ్రీకారం చుట్టారు. ఒక్కో పట్టణంలో రెండు, నాలుగు వరకు బస్తీ దవాఖానలు అందుబాటులోకి రావడంతో ప్రజల బాధలు తీరిపోయాయి.


చెంగిచెర్లలో బస్తీ దవాఖానను ప్రారంభించిన మంత్రి మల్లారెడ్డి(ఫైల్)

**28 బస్తీ దవాఖానలు**

మేడ్చల్ నియోజకవర్గంలో ఉన్న ఏడు మున్సిపాలిటీలు, మూడు కార్పొరేషన్లలో దశలవారీగా 28 బస్తీ దవాఖానలను ఏర్పాటు చేశారు. వివిధ మున్సిపాలిటీల్లో ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానలు ఇలా ఉన్నాయి.

మేడ్చల్ 4, ఘట్‌కేసర్ 3, గుండ్లపోచంపల్లి 2, పోచారం 4, నాగారం 4, దమ్మాయిగూడ 2, తూంకుంట 1, జవహర్‌నగర్ 3, బోడుప్పల్ 3, పీర్జాదిగూడ 2.


ఘట్‌కేసర్‌లో వైద్యం అందిస్తున్న వైద్యురాలు

### అందుతున్న సేవలు

ఓపీతో పాటు అవసరమైన వారికి 15 రకాల వైద్య పరీక్షలు చేస్తున్నారు. ఎఫ్‌బీఎస్, సీఆర్‌పీ, హెచ్‌బీఏ1సీ, థైరాయిడ్, సిరం కాల్షియల్, ఎల్‌ఎఫ్‌టీ, డెంగీ తదితర పరీక్షలు నిర్వహిస్తున్నారు. సోమవారం నుంచి శుక్రవారం వరకు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు, ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు వైద్య సేవలు అందిస్తున్నారు. చికిత్సతోపాటు మందులను ఉచితంగా అందజేస్తున్నారు. ఒక్కో బస్తీ దవాఖానలో ప్రతిరోజు 60 నుంచి 120 మంది వరకు ఓపీ సేవలు అందుతున్నాయి. దవాఖానాలో ఒక వైద్యుడు, స్టాఫ్‌నర్సు, ల్యాబ్ టెక్నీషియన్ వైద్య సేవలు అందిస్తున్నారు. అలాగే టెలీ కన్సల్టెన్సీ ద్వారా 10 రకాల స్పెషలిస్టులను కలిసే అవకాశాన్ని కూడా కల్పించారు.

### ఖర్చు...ప్రయాణ భారం తప్పింది



రెండేండ్ల కిందట నాకు పక్షపాతం వచ్చింది. ప్రతి నెలా పరీక్షలు, మందుల కోసం ఐదారు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈసీఐఎల్‌కు వెళ్తుండేవాన్ని. దీంతో వేలాది రూపాయలు ఖర్చు అయ్యేది. ఎవరో ఒకరు తోడు లేకుండా అంతదూరం వెళ్లడం సాధ్యం కాకపోయేది. ఏడాది కింద మా ఇంటి పక్కకే బస్తీ దవాఖాన వచ్చింది. మంత్రి మల్లారెడ్డి ప్రారంభించారు. అప్పటి నుంచి నా ఇబ్బందులు తప్పాయి. ఇక్కడనే ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తున్నారు. మందులు ఇస్తున్నారు. పేదల కోసం ఆలోచిస్తున్న సీఎం కేసీఆర్‌కు చేతులెత్తి మొక్కుతున్నా. మళ్లీ ఆయనే సీఎం కావాలి.

*– నీల యాదయ్య, బాధితుడు, నాగారం*

### ప్రజల చెంతకే వైద్యం



బస్తీ దవాఖానలతో ప్రజల వద్దకు వైద్యం వచ్చింది. దగ్గు, జలుబు, జ్వరం లాంటి అనారోగ్యాలకు కూడా వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సిన పరిస్థితులు ఉండేవి. బస్తీ దవాఖానల ఏర్పాటుతో ఆ ఇబ్బందులన్నీ తొలగిపోయాయి. ప్రధానంగా పేదలకు ఉపయోగకరంగా మారింది. మాకు ఉచిత వైద్య సేవలు అందుబాటులో లేకపోవడంతో దూరంగా ఉన్న ప్రైవేట్ దవాఖానలకు వెళ్లేవాళ్లం. మా వార్డుకే బస్తీ దవాఖాన రావడంతో సమయం, డబ్బులు రెండూ ఆదా అవుతున్నాయి. సీఎం కేసీఆర్ అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడే పథకాలను అమలు చేస్తున్నారు.

*– రొక్కం నర్సింహారెడ్డి, కనకదుర్గ నగర్ కాలనీ-3, బోడుప్పల్*

## జవహర్‌నగర్ బీఆర్‌ఎస్‌లో భారీగా చేరికలు


బీఆర్‌ఎస్‌లో చేరిన అరుంధతినగర్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు

జవహర్‌నగర్, నవంబర్ 11 : జవహర్‌నగర్ బీఆర్‌ఎస్‌లో భారీగా చేరికలు జరుగుతున్నాయి. ప్రజలంతా గులాబీల జెండా పట్టి.. అభివృద్ధి చేసే బీఆర్‌ఎస్ బాట పయనిస్తున్నారని బీఆర్‌ఎస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి చామకూర మహేందర్‌రెడ్డి అన్నారు. శనివారం కార్పొరేషన్‌లోని అరుంధతినగర్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు 200 మంది చామకూర మహేందర్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. మేడ్చల్ అద్భుతంగా ప్రగతి చెందిందని, అభివృద్ధిని చూసే కాంగ్రెస్, బీజేపీ నాయకులు బీఆర్‌ఎస్‌కు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. అనంతరం పార్టీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి స్వాగతం పలికారు. యువజన విభాగం అధ్యక్షుడు భార్గవ్‌రామ్, 16వ డివిజన్ ఇన్‌చార్జి సత్యం, ప్రశాంతిబాబారావు, బీఆర్‌ఎస్ నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## మంత్రి మల్లారెడ్డిని గెలిపించుకుంటాం



మంత్రి మల్లారెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించుకుంటామని కీసర మాజీ ఎంపీటీసీ బెలిదే రమేశ్‌గుప్త తెలిపారు. కీసర మండలంలోని పలు గ్రామాల్లో శనివారం వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామస్థాయి నేతలు కలిసి బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి మంత్రి మల్లారెడ్డికి ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. *– కీసర, నవంబర్ 11*

## మేధాశక్తిని పెంపొందిస్తేనే శక్తివంతులు



మేధస్సుకు జ్ఞానం, నైపుణ్యాలు కలిస్తేనే మానవుడు అతి శక్తివంతమైన జీవిగా ఎదుగుతారని మైక్రోసాఫ్ట్ ప్రొడక్ట్ మేనేజర్ ముస్కాన్ హుండా తెలిపారు. మండల పరిధి వెంకటాపూర్‌లోని అనురాగ్ యూనివర్సిటీలోని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విభాగం ఆధ్వర్యంలో మేధాశక్తిని అన్ లాక్ చేయడం అనే అంశంపై జరిగిన కార్యక్రమంలో ముస్కాన్ హుండా ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత ప్రపంచంలో మెషిన్ లెర్నింగ్ ముఖ్య పాత్ర ఎలా పోషిస్తుందో అర్థం చేసుకోవడానికి విద్యార్థులకు ఈ సదస్సు ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. ఈకార్యక్రమంలో ఏఐ హెచ్‌వోడీ మల్లికార్జున్ రెడ్డి, ఈవెంట్ కోఆర్డినేటర్ శిల్ప, విద్యార్థులు పాల్గొన్నారు.

*– ఘట్‌కేసర్ రూరల్, నవంబర్ 11*

## మహిళా సంఘం డబ్బులు మాయం.. ఇద్దరిపై ఫిర్యాదు

ఘట్‌కేసర్ రూరల్, నవంబర్ 11: స్త్రీనిధి మహిళా సంఘం డబ్బులు వసూలు చేసి బ్యాంక్‌లో జమ చేయకుండా కాజేసిన సంఘం అధ్యక్షురాలు, సహాయకురాలిపై కేసు నమోదు చేసిన సంఘటన పోచారం ఐటీసీ పోలీసు స్టేషన్ పరిధిలోశనివారం జరిగింది. పోచారం ఐటీసీ పోలీసులు, మహిళ సంఘం అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ తౌర్యానాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. పోలీసు స్టేషన్ పరిధి చౌదరిగూడలోని స్త్రీనిధి మహిళా సంఘం అధ్యక్షురాలు పి కరుణ, సహాయకురాలు బి సువర్ణలు స్త్రీనిధి పరపతి సహకార సమాఖ్య లిమిటెడ్ నుంచి మహిళా సంఘం సభ్యులు తీసుకున్న రుణాన్ని వాయిదాలుగా చెల్లించిన డబ్బులను వసూలు చేసి.. సొంతానికి వాడుకున్నారు. స్త్రీనిధి రుణాలకు గాను మహిళా సంఘం సభ్యులు చెల్లించిన రూ.7,10,846 లను బ్యాంక్‌లో చెల్లించకుండా సొంతానికి వాడుకోవడంతో 2022 నవంబర్ 6న ఆడిట్ రిపోర్టు ఆధారంగా డబ్బులు కాజేసినట్లు గుర్తించారు. కాజేసిన డబ్బులను వెంటనే జమ చేయాలని ఒత్తిడి చేయగా.. రూ.1,20,846 చెల్లించి చేతులెత్తేశారు. మిగతా డబ్బులు చెల్లించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పాటు బెదిరింపులకు దిగడంతో శనివారం ఆ సంఘం అధ్యక్షురాలు భార్గవి పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో ఏపీఎం తౌర్యనాయక్, మహిళా సంఘం అధ్యక్షురాలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

## ఎన్నికలకు కట్టుదిట్టమైన చర్యలు : రాచకొండ సీపీ చౌహాన్

కీసర, నవంబర్ 11 : అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని రాచకొండ సీపీ చౌహన్ పోలీసు అధికారులను ఆదేశించారు. అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా మండలంలోని భోగారంలోని హోలీమేరి ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్నికల కౌంటింగ్‌కు సంబంధించి స్ట్రాంగ్ రూంల ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ గౌతమ్‌తో కలిసి పరిశీలించారు. కౌంటింగ్ కేంద్రంలో ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లా కలెక్టర్ ఏర్పాట్లకు సంబంధించి సీపీకి పలు విషయాలను సూచించారు. అక్కడి నుంచి నేరుగా కీసరగుట్టకు వెళ్లే మార్గం వద్ద చెక్ పోస్టును సందర్శించారు. ఎన్నికలకు సంబంధించి ఎప్పటికప్పుడు ప్రతి వాహనాన్ని చెక్ చేసి పంపాలని సూచించారు. అనంతరం కీసర పోలీస్‌స్టేషన్‌కు విచ్చేశారు. సీఐ వెంకటయ్య సీపీకి పుష్పగుచ్ఛం అందించి ఘనస్వాగతం పలికారు. ఈనెల 30వ తేదీన జరిగే అసెంబ్లీ ఎన్నిలకు సంబంధించి పోలీసు శాఖ గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తుందని, రాజకీయల పార్టీల మధ్య ఎలాంటి గొడవలు తలెత్తకుండా పోలీసులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి డీసీపీ జానకి, ఏసీపీ, కీసర సీఐలతో పాటు పలువురు పాల్గొన్నారు.


అసెంబ్లీ ఎన్నిలకు సంబంధించి ఏర్పాట్ల గురించి సీపీకి వివరిస్తున్న జిల్లా కలెక్టర్ గౌతమ్

## మానవసేవే.. మాధవసేవ

### డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్

జవహర్‌నగర్, నవంబర్ 11 : పేదవారికి సాయం చేసినప్పుడు నిజమైన ఆనందం కలుగుతుందని, మానవసేవే.. మాధవసేవని డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ అన్నారు. కార్పొరేషన్‌లోని సంతోష్‌నగర్‌కు చెందిన ప్రశాంతిశ్రీనివాస్‌గౌడ్‌ల కుమార్తె అక్షిత(11) డెంగీతో చికిత్స పొందుతూ మరణించగా, ఈ విషయాన్ని స్థానికులు డిప్యూటీ మేయర్‌కు తెలుపగా వెంటనే స్పందించి రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు. బాధిత కుటుంబాన్ని కార్పొరేటర్ శారదా మనోధర్‌రెడ్డి పరామర్శించి రూ.5వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

# 14 నుంచి కార్తిక మాసం పూజలు

### కీసరగుట్ట ఆలయంలో సర్వం సిద్ధం

కీసర, నవంబర్ 11 : కీసరగుట్ట శ్రీభవాని రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 14 నుంచి డిసెంబర్ 12వ తేదీ వరకు నెల రోజులపాటు కీసరగుట్ట ఆలయంలో కార్తికమాసం పూజలు జరుగనున్నాయి. ఈ ఆలయంలో దేవస్థానం వారు కార్తీక మాసానికి సంబంధించి చక్కగా ముస్తాబు చేశారు. ఈ పూజలకు పలు ప్రాంతాల నుంచి విచ్చేసే భక్తులు ప్రతిరోజు స్వామివారిని దర్శించుకొని గర్భాలయంలో అభిషేకాలు చేస్తారు. నెల రోజులపాటు జరిగే పూజల వివరాలను ఆలయ చైర్మన్ తటాకం రమేశ్ శర్మ, ఆలయ కార్యనిర్వహణాధికారి నరేందర్ వెల్లడించారు. ఈనెల 14న గర్భాలయంలో స్వామివారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, క్షీరాభిషేకం, ఆకాశ దిపోత్సవం, 17న నాగుల చవితి పుట్టలో పాలు పోయుట, నాగదేవత ఆలయంలో ప్రత్యేక పూజలు, 19న శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం, 20న పంచామృతాభిషేకం, 23న శ్రీ సత్యనారాయణస్వామి వ్రతం, 24న క్షీరాభిషేకం, తులసిపూజ, 26న నానావిధ ఫల రసాభిషేకం, జ్వాలాతోరణం, మహాలింగ దిపోత్సవం, 27న రుద్రాభిషేకం, కార్తీకపౌర్ణమి కావడంతో ఇక్షు రసాభిషేకం, 30న శ్రీభవాని రామలింగేశ్వరస్వామివారి కల్యాణం, డిసెంబర్ 3న నానావిధ పత్రిపూజ, 4న క్షీరాభిషేకం, 8న శ్రీసత్యనారాయణస్వామి వ్రతం, 10న నానావిధ పుష్పార్చన, 11న శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి కల్యాణం, 12న స్వామివారికి తైలాభిషేకం వంటి కార్యక్రమంతో కార్తిక మాసం పూజలు ముగియనున్నాయి.


కీసరగుట్ట భవాని రామలింగేశ్వరస్వామి ఆలయం